


నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన విమోచనోద్యమంలో ఓరుగల్లు పోరుగల్లై అగ్నిజ్వాలలు కురిపించింది. పల్లే పట్నం తేడా లేకుండా సామాన్యులు సమర యోధులై దండు కట్టారు. బానిసత్వం నుంచి విముక్తి కోసం తిరుగులేని పోరు సాగించారు. ప్రాణాలను తృణప్రాయం చేసి స్వేచ్ఛ కోసం తపించారు. సాయుధ రజాకార్లు, నిజాం పోలీసులు ఎంత అణిచివేయడానికి ప్రయత్నించినా, భూస్వామ్య జమీందారి వర్గం, వారి తాబేదార్లు రాచరికానికి బాసటగా నిలిచినా.. ప్రజలు వీరోచిత పోరాటాలు చేశారు. మడమ తిప్పకుండా సాగిన పోరులో ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. రజాకార్ల దౌర్జన్యాలకు ఎందరో బలయ్యారు. అనేకమంది ప్రాణత్యాగాలు చేశారు. ఆయుధాలు ధరించారు. జైళ్లలో మగ్గారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. చివరకు భారత యూనియన్ సేనల 'ఆపరేషన్ పోలో'తో 1948 సెప్టెంబరు 17న నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యేటా సెప్టెంబర్ 17ను విమోచన దినంగా పాటిస్తున్నారు. ఇదే రోజును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా జరుపుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏ పల్లెను తడిమినా నాటి నెత్తుటిగాథలనే వినిపిస్తాయి. నాటి పీడనకు, పోరాటానికి పల్లెల్లో అనేక కట్టడాలు సాక్షీభూతాలుగా కనిపిస్తాయి. అప్పటితరం యోధులు క్రమక్రమంగా కనమరుగుఅవుతున్నా.. మిగిలివున్న వారు చెప్పే జ్ఞాపకాలు శరీరాన్ని నిలువెల్లా భావోద్వేగం ఉప్పొంగేలా చేస్తాయి. నాటి ఘట్టాలను మననం చేసుకొంటూ యోధుల త్యాగాలను కీర్తించే సందర్భమిది....

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

స్వేచ్ఛ కోసం రక్తతర్పణం



నిజాం పాలన నుంచి విముక్తి కోసం పోరుగల్లుగా మారిన ఓరుగల్లు

- రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలి
- ఎదురించి పోరాడిన ప్రజలు
- వీరోచిత పోరాట దీప్తి బైరాన్‌పల్లి
- మరో జలియన్‌వాలా బాగ్ పరకాల
- పెత్తందారులపై సమరశంఖం పూరించిన చాకలి ఐలమ్మ, బందగీ
- ఉద్యమ స్ఫూర్తి దొడ్డికొమురయ్య, బత్తిని మొగిలయ్య
- విమోచన ఉద్యమంలో అగ్రభాగాన మెరిసిన నేల
- నేడు హైదరాబాద్ సంస్థాన విమోచన దినం

7



నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్

మహబూబాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు మంగళవారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.58గంటలకు కలెక్టరేట్ వద్ద ముఖ్యఅతిథి ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ స్వాగతిస్తారు. 10గంటలకు కలెక్టరేట్‌లో ప్రభుత్వవిప్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 10.01కు జాతీయ గీతాలపన, 10.02కు తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతాలపన, 10.07కు ముఖ్య అతిథి పోలీసులచే గౌరవవందనం స్వీకరిస్తారు. 10.10కు ముఖ్యఅతిథి ప్రసంగం, 10.15 గంటలకు జాతీయ గీతాలపనతో ముగియనుంది.



ఎన్‌జీసీ డైరెక్టర్ ప్రసన్నకుమార్ నుంచి నియామకపత్రాన్ని అందుకుంటున్న వి.గురునాథరావు

పర్యావరణ దీక్షకు గుర్తింపు

- ఎన్‌జీసీ పర్యావరణ విద్య అంబాసిడర్‌గా గురునాథరావు
- నియామక పత్రం అందజేసిన నేషనల్ గ్రీన్‌కోర్ డైరెక్టర్
- పెనుగొండ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు

మహబూబాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పర్యావరణ విద్య బ్రాండ్ అంబాసిడర్‌గా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు వూరె గురునాథరావు నియామకమయ్యారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో సోమవారం రాత్రి గురునాథరావుకు నేషనల్ గ్రీన్‌కోర్ (ఎన్‌జీసీ) డైరెక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆయన కేసముద్రం మండలం పెనుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధు లు నిర్వహిస్తున్నారు. ఆయన్ను రాష్ట్ర పర్యావరణ, అటవీశాస్త్ర సాం కేతిక శాఖ ఆధ్వర్యంలో నేషనల్ గ్రీన్‌కోర్ పర్యావరణ విద్య అంబాసిడర్‌గా ఎంపిక చేశారు.

గురునాథరావు మహబూబాబాద్ జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్, మాస్టర్ ట్రైనర్‌గా, పాఠశాలలస్థాయిలో పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. ఆయన నేతృత్వంలో హైదరాబాద్‌లో నిర్వహించిన క్రాప్ బయోడైవర్సిటీ యూఎన్‌వో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని మానుకోట జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చారు. విద్యార్థుల పర్యావరణ కాంగ్రెస్, జాతీయస్థాయి పర్యావరణ పోటీల్లో కూడా జిల్లా విద్యార్థులు ప్రతిభను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. గురునాథరావు నిబద్ధత, అనుభవం, (20 ఏళ్ల పర్యావరణ సేవ) నాయకత్వం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో పర్యావరణ అవగాహనను పెంపొందించడం స్ఫూర్తిగా నిలిచింది. కాగా, గురునాధరావు ఎంపిక పట్ల జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

'ఆమె'కు ఆరోగ్యం



- పోషకాహార లోప నివారణకు శ్రీకారం
- నేటి నుంచి అక్టోబరు 16 వరకు నిర్వహణ
- విజయవంతానికి ప్రత్యేక ప్రణాళికలు
- ఇప్పటికే కింది స్థాయి అధికారులకు దిశా నిర్దేశం
- జిల్లాలో ఐదు ప్రాజెక్టులు, 1,437 కేంద్రాలు



నేటి నుంచి పోషణ మాసం

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజం కోసం రాష్ట్ర సర్కారు నడుబిగించింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఏటా ఏటా నెల రోజుల పాటు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి ఆరోగ్యవంతంగా ఉండడం కోసం తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది పోషణ మాసాన్ని విజయవంతం చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణీల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు పోషణ మాసం నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార సందేశాన్ని ప్రతీ ఇంటికి పంపనున్నారు. అందుకు సంబంధించి నెల రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రాజెక్టుల వారీగా పోషణ మాసం నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరీ చేసింది.

నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి..

మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్, మరిపెడ, తొర్రూరు ప్రాజెక్టుల పరిధిలోని 1437 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ మాసం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైద్య ఆరోగ్య, విద్య, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వైద్య శాఖ అధికారులతో సమన్వయ సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో పోషణ మాసంపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి అక్టోబరు 16 వరకు జరుపతలపెట్టిన పోషణ మాసంలో ప్రతీరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రధానంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, మహిళలు, కిషోరబాలికలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోషణ మాసం కొనసాగనుంది. ఇందులో ఆరోగ్యజీవనానికి కావాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించనున్నారు.

నేటి నుంచి ప్రారంభం ..

పోషణ మాసం తొలిరోజు సెప్టెంబరు 17న అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు,

(మిగతా 8లో..)

పోషణ మాసం విజయవంతానికి చర్యలు



- శిరీష, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

పోషణ మాసం విజయవంతానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు పోషణ మాసం కార్యక్రమాలు కొనసాగుతాయి. ఇప్పటికే జిల్లా, మండలస్థాయిలో సంబంధిత అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశాలు జరిగాయి. చిన్నారులు, మహిళల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం పోషణమాసాన్ని నిర్వహిస్తుంది. నెల రోజుల పాటు ప్రభుత్వం సూచించిన విధంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తాం.

ప్రాజెక్టు	కేంద్రాలు	గర్భిణీలు	బాలింతలు	చిన్నారులు	కిషోరబాలికలు
డోర్నకల్	310	904	641	7743	2768
గూడూరు	209	583	418	5160	1283
మహ-బాద్	380	1288	905	11983	3662
మరిపెడ	297	704	525	6593	2174
తొర్రూరు	241	776	498	6351	2110
మొత్తం	1437	4255	2987	37380	11997

నేడే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సభ

- హాజరు కానున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- పెద్ద ఎత్తున తరలిరావాలి : జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని వీఆర్‌ఎన్ గార్డెన్స్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను నిర్వహిస్తున్నారు. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గతవారం రోజులుగా శాఖ సమావేశాలు నిర్వహించి, సీపీఎం శ్రేణులను సమాయత్తం చేశారు. వీఆర్‌ఎస్ గార్డెన్స్‌లో 17న జరుపతలపెట్టిన రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవసభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హాజరవుతున్నారని, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మంగళవారం విజ్ఞప్తి చేశారు. సీపీఎం శ్రేణులు, మేధావులు, సానుభూతిపరులు, యువకులు హాజరుకావాలన్నారు.

భగీరథ ఎయిర్ వాల్వ్ దిమ్మెను ఢీకొట్టి ఒకరి మృతి

కేసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం వెంకటగిరి చంద్రుతండా సమీపంలో మంగళవారం రాత్రి అదే తండాకు చెందిన లకావత్ దేవ(35) ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు వెంటనున్న మిషన్‌భగీరథ ఏయిర్‌వాల్వ్ దిమ్మెను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. వెంకటగిరి నుంచి చంద్రుతండాకు వెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ఓ వాహనం లైట్ల వెళుతురులో రోడ్డు కనిపించక అదుపుతప్పి పక్కనున్న భగీరథ ఏయిర్‌వాల్వ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవ తలకు తీవ్రగాయమైంది. ఆయన్ను ప్రైవేటు వాహనంలోజిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. మృతుడికి భార్య అనిత, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్ హనుమంతుని గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తొడేటి వెంకన్న సహకారంతో ఏర్పాటు చేసిన టై, బెల్టులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సర్కార్ వసతులు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండటం వల్లనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. హెచ్‌ఎం హల్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, లచ్చి రాం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, టీపీ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ షైన శ్రీనివాస్, ఉపాధ్యాయులు బాలాజీకుమార్, శంకర్, సాయి, శిరీష, కిరణ్, రష్మిత పాల్గొన్నారు.



విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న దక్షిణామూర్తి



మానుకోట రైల్వేస్టేషన్‌లో రైల్వేట్రాక్ పనులను పరిశీలిస్తున్న రైల్వేసేఫ్టీ అధికారుల బృందం

త్వరలో 3వ నెంబరు రైల్వేలైన్ ట్రాక్‌ను అందుబాటులోకి తెస్తాం

- దక్షిణమధ్య రైల్వేజోనల్ (సీఆర్‌ఎస్) కమిషనర్ ఆఫ్ రైల్వేసేఫ్టీ అధికారి మాధవి
- అధికారులకు వినతులు అందించిన ఎమ్మెల్యే, వామపక్ష నేతలు

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో త్వరలో 3వ నెంబరు రైల్వేలైన్ ట్రాక్‌ను అందుబాటులోకి తెస్తామని దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఆఫ్‌రైల్వే సేఫ్టీ (సీఆర్‌ఎస్) అధికారి మాధవి, సికింద్రాబాద్ డీఆర్‌ఎం గోపాలక్రిష్ణన్ తెలిపారు. మంగళవారం మహబూబాబాద్‌లోని రైల్వేస్టేషన్‌ను వారు సందర్శించారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో 3వ నెంబరు ప్లాట్‌ఫారం వద్ద జరుగుతున్న ట్రాక్ చేజింగ్ పాయిం ట్ పనులను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న 3వ రైల్వే ట్రాక్‌పై రైళ్లను నడపడానికి సన్నాహకంలో భాగంగా మోటారు ట్రాలీపై కూర్చుని ట్రాక్ సామర్థ్యాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ పనులు స్టేషన్‌మాస్టర్ గది, ఫుట్ ఓవర్ బ్రిడ్జీ, సేఫ్టీ గది పనులను వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఆర్‌ఎస్ శ్రీనివాసరావు, సీనియర్ డీవోఎం సురేష్‌రెడ్డి, సీనియర్ డీఎస్‌టీఈ గుడేచార్, స్టేషన్ మాస్టర్ కనకరాజు, ఇంజనీరింగ్, టెలికాం, సెక్షన్ అధికారుల బృందం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి..

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో 3వ నెంబరు రైల్వేలైన్ పరిశీలనకు వచ్చిన రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, డీఆర్‌ఎం గోపాలక్రిష్ణన్‌లకు రైల్వే సంబంధిత సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ వినతి పత్రం అందజేశారు. కొత్త బజారు వైపు నాలుగవ నెంబర్ ప్లాట్ ఫారం నిర్మించాలని, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కలించాలని



రైల్వే డీఆర్‌ఎం గోపాలక్రిష్ణన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

(మిగతా 8లో..)

అభివృద్ధి పనులపై సమీక్ష

- కలెక్టర్‌ను కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే



కలెక్టర్‌తో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను కలిసి సమీక్షించారు. తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులు పూర్తి చేసి ప్రజల తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి వాటికి అవసరమయ్యే ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటిగ్రేటెడ్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. కూరగాయలు, మటన్, చేపలను మార్కెట్‌లోనే విక్రయించాలని సూచించారు. అభివృద్ధి పనులు పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఇంకా పలు అభివృద్ధి ప నులపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసి పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రైతులకు పరిహారం

» ఎన్‌హెచ్ 930 పీ భూ నిర్వాసితుల కోసం కసరత్తు
» డివిజన్‌లో 160 ఎకరాల్లో భూ సర్వే పూర్తి
» ఎకరానికి రూ.30 లక్షలు ఇవ్వాలని రైతుల డిమాండ్



జాతీయ రహదారిగా మారనున్న తొర్రూరు-మహబూబాబాద్ రోడ్డు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వలిగొండ టూ భద్రాచలం వయా తొర్రూరు మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 930పీ నిర్మాణం పనులపై అధికారులు కసరత్తులో వేగం పెంచారు. జిల్లాలో మూడో ప్యాకేజీ తొర్రూరు నుంచి నెహ్రూనగర్ వరకు 69.8 కి.మీ వరకు నిర్మాణం జరిగే పనుల్లో భాగంగా తొర్రూరు డివిజన్‌లో పెద్దవంగర, తొర్రూరు, నెల్లికుదురు మండలాల్లో జాతీయ రహదారి వెళ్తుండడంతో 160 ఎకరాల భూములు రైతులు కోల్పోతున్నారు. వారికి సబ్‌రిజిస్ట్రార్ ధర ప్రకారం మూడింతలు నష్టపరిహారం చెల్లించడానికి అధికారులు సిద్ధయ్యారు. గత నెలలో రెవెన్యూ అధికారులు ఎంత పరిహారం వస్తుందో రైతులకు తెలియజేశారు. మొదటి ప్యాకేజీ కింద గౌరెల్లి నుంచి వల్లిగొండ, రెండవ ప్యాకేజీ వలిగొండ నుంచి తొర్రూరు, మూడో ప్యాకేజీ తొర్రూరు నుంచి నెహ్రూనగర్, నాల్గొవ ప్యాకేజీ నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం వరకు సుమారు 240 కి.మీ. వరకు 100 ఫీట్ల వెడల్పుతో నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

జాతీయ రహదారి 930పీ నిర్మాణం ఇలా..

వలిగొండ నుంచి భద్రాచలం వరకు వెళ్లే 930పీ జాతీయ రహదారి రెండో ప్యాకేజీ కింద ప్రారంభమైన పనులు మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల శివారులోని బైపాస్ వద్ద ముగియగా మూడో ప్యాకేజీ కింద తొర్రూరు బైపాస్ నుంచి నెహ్రూసెంటర్ వరకు సుమారు 70కి.మీ రహదారి నిర్మాణంకు టెండర్ల పక్రియ పూర్తయింది. పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలోని ఎల్‌బీ తండా వద్ద బైపాస్‌గా మారి తొర్రూరు మండలం వెంకటాపురం, హరిపిరాల, గోపాలగిరి, తొర్రూరు, ఫత్తేపురం గ్రామ శివారులోని వ్యవసాయ భూముల నుంచి మడిపల్లి గ్రామ శివారులో తొర్రూరు-మహబూబాబాద్ రహదారికి కలువనుంది. ఈ బైపాస్ మార్గంలో సుమారుగా 65 హెక్టార్లలో (165ఎకరాలు) ఆయా గ్రామాల్లో సర్వే చేసిన అధికారులు మార్కింగ్ పూర్తి చేశారు.

- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

- జి. గణేష్, ఆర్డీవో, తొర్రూరు



జాతీయ రహదారి నిర్మాణంతో భూమి కోల్పోతున్న రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. అభ్యంతరాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. తొర్రూరు డివిజన్‌లోని మూడు మండలాల్లో సర్వే పూర్తి చేసి 65 హెక్టార్ల భూమి గుర్తించాం. రైతులకు సబ్ రిజిస్ట్రార్ వాల్యూ ప్రకారం మూడింతలు ధర నిర్ణయించాం.

పరిహారం పెంచాలని రైతుల డిమాండ్

భూమి కోల్పోతున్న రైతులతో రెవెన్యూ అధికారులు చర్చలు జరిపారు. ప్రభుత్వం తరుపున సహాయం చేస్తామని రైతులు సహకరించాలని సూచించారు. ఎకరాకు రూ.20లక్షలకు పైగా ధర చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

THORRUR-NEHRUNAGAR (KM 109+420 TO KM 178+500) SECTION OF NH-930P (JUNCTION AT HYDERABAD ORR (INTERCHANGE AT GOWRELLY) - VALIGONDA - THORRUR - NELLIKUDURU - MAHABUBABAD - YELLANDU - KOTHAGUDEM JUNCTION AT NH-30)



రెడ్ మార్క్‌తో ఉన్న జాతీయ రహదారి 930పీ మ్యాప్

కార్యకర్తలను కాపాడుకుంటా.. : ఎమ్మెల్యే యశస్విని

పెద్దవంగర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, కార్యకర్తలను కాపాడుకుంటామని ఎమ్మెల్యే ఎం. యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పోచారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోత్ సీతారామ్ తల్లి నాగమ్మ (75) ఇటీవల మృతి చెందింది. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ముత్యాల పూర్ణచందర్, తోటకురి శ్రీనివాస్, గోపాల్, రవీందర్‌రెడ్డి, ముత్తినేని శ్రీనివాస్, వెంకన్న, రవి, ఉపేందర్, శ్రీనివాస్, సైదులు, యాకన్న, మల్లేష్, సతీష్, మహేష్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మద్దెల సుధాకర్‌గౌడ్ సాహితీ కిరీటి పురస్కారానికి ఎంపికయ్యారు. సుధాకర్‌గౌడ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.

19న ఎస్జీఎఫ్ఐ క్రీడా పోటీలు

మరిపెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి 69వ ఎస్జీఎఫ్ఐ క్రీడా పోటీలను ఈ నెల 19న మండల కేంద్రంలోని పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో అనితాదేవి మంగళవారం తెలిపారు. 14, 17 ఏళ్ల విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. ఎంఈవో వెంట రాజకుమారి, పీడీలు, పీఈటీలు ఉన్నారు.

కేజీబీవీ సిబ్బందికి పనిభారం తగ్గించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ బాధ్యులు

మరిపెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పని చేస్తున్న బోధనేతర సిబ్బందికి పనిభారం తగ్గించి పనికి తగిన వేతనం ఇవ్వాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. మంగళవారం మరిపెడ కేజీబీవీ సిబ్బందితో కలిసి చలో ఎస్పీడీ ముట్టడి ప్రోగ్రాం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఆ సంఘ బాధ్యులు రాంలాల్, పుల్లమ్మ, లలిత, జ్యోతి, సలీమా పాల్గొన్నారు.

నరేశ్‌రెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పరిశీలన

మరిపెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నూకల నరేశ్‌రెడ్డి విగ్రహాన్ని ఆయన వ్యవసాయ క్షేత్రంలోని కుమారులు అనురుధ్ రెడ్డి, అభినవ్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మంగళవారం స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ నెల 23న నరేశ్‌రెడ్డి విగ్రహాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నేత రామసహాయం సురేందర్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారు. నిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే వెంట నరేశ్‌రెడ్డి తనయుడు, యువ కాంగ్రెస్ నేత అభినవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబరీష, మాజీ సర్పంచ్ రాంలాల్, పట్టణ అధ్యక్షుడు



విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్నరాంచంద్రునాయక్

తాజొద్దీన్, మెంచు అశోక్, వెంకటసాయి, బోడా రమేశ్, గుండాగాని వెంకన్న, వేణు తదితరులు ఉన్నారు.

'స్వస్థ నారి'పై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవి

మరిపెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ నారి-సశక్త్ పరివార్ అభియాన్‌పై మహిళలకు అవగాహన కల్పించాలని మండల మెడికల్ ఆఫీసర్ గుగులోత్ రవి సూచించారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ మరిపెడ పీహెచ్‌సీలో ప్రారంభిస్తారన్నారు. మంగళవారం ఆయన మరిపెడ పీహెచ్‌సీలో ఈ కార్యక్రమంపై పల్లె దవాఖాన డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమల, మంగమ్మ, కృష్ణ, సుదర్శన్, ఆచార్యులు, సిరి, ఝాన్సీ, సాయిశ్రీ, ఉపేంద్ర, సౌజన్య, తరుణి తదితరులు పాల్గొన్నారు.

విప్లవ నారి చాకలి ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మరిపెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విప్లవ నారి చాకలి ఐలమ్మ అని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న అన్నారు. మంగళవారం సీఐటీయూ, హమాలీ వర్కర్స్, గ్రైండర్ వర్కర్స్ యూనియన్ ఐలమ్మ వీరోచిత పోరాట పటిమను గుర్తు చేస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీరన్న ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

పాలకుర్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల పైబడి సర్వీస్‌లో ఉపాధ్యాయులు టెట్ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని, లేకుంటే ఉద్యోగాలను వదులుకోవాలని తీర్పు నుంచి రక్షణ కల్పించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలని, అలాగే టెట్ సిలబస్, అర్హత ప్రమాణాలను శాస్త్రీయంగా ఎన్సీటీఈ సవరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో ప్రకటించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయాలని కోరారు. సమస్య పరిష్కరించాలని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజ్‌కుమార్

గార్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని లంబాడి హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడలపై పోటీతత్వం పెరగాలని, తద్వారా మంచి విజయాలు సాధించి సమాజాభివృద్ధి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగావత్ లక్ష్మణ్‌నాయక్, హాతిరాం నాయక్, మాలోత్ శివనాయక్, కందునూరి శ్రీనివాస్, యాకుబ్ పాషా పాల్గొన్నారు.

పట్టా కావడం లేదని ఆత్మహత్య

మనస్తాపంతో బలవన్మరణం

రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో ఘటన



వెంకటయ్య(ఫైల్)

రఘునాథపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తండ్రి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమి తన పేరున మార్చుకోవడానికి ఏడేళ్లుగా అధికారులు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా రఘు నాథపల్లి మండలం గోవర్ధనగిరిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గోవర్ధన గిరికి చెందిన ముసిపట్ల వెంకటయ్య (పల్లా)కు కొంరయ్య, వెంకటయ్య(54) ఇద్దరు కుమారులు. తండ్రి వెంకటయ్య (పల్లా)గతంలోనే చనిపోయాడు. తన పేరు మీద ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిని ఇద్దరి కొడుకులకు ఒక్కొక్క ఎకరం చొప్పున పంచి ఇచ్చాడు. చిన్నకొడుకు వెంకటయ్యకు తన తండ్రి నుంచి వచ్చిన ఎకరం వ్యవసాయ భూమి నుంచి 25 గుంటల భూమి తన పేరుపై పట్టా అయింది. మిగతా 15 గుంటల భూమి కొన్ని సాంకేతిక కారణాలతో తన పేరుపై పట్టా కాకపోవడంతో రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అనంతరం సమస్య పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో సైతం సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రాజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'సెప్టెంబర్ 17'ను విద్రోహ దినంగా పాటించాలి

తొర్రూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన, విముక్తి కాదని విద్రోహ దినంగా పాటించాలని న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి అలకుంట్ల సాయిలు అన్నారు. మంగళవారం తొర్రూరులో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాట ఫలితంగానే 3వేల గ్రామాలు విముక్తి పొందాయన్నారు. 10 లక్షల ఎకరాల భూములను నిరుపేదలు దున్నుకున్నారని తెలిపారు. ప్రస్తుత తెలంగాణలో లక్షల ఎకరాల భూమి దొరల పాలవుతుందని, దోపిడీ పాలకవర్గాలను తిప్పికొట్టాలన్నారు. నిర్బంధం ఎప్పటికి చెల్లదన్నారు. కార్యక్రమంలో నాయకులు యాకూబ్, మంగీలాల్, శ్రీను, చంద్రన్న, వెంకన్న తదితరులు ఉన్నారు.

సాయుధ పోరాటంతోనే తెలంగాణకు విముక్తి

గార్ల : జాగీరు, నవాబు రాక్షస పాలనలో కమ్యూనిస్టుల సాయుధ పోరాటంతోనే తెలంగాణలో వెట్టి చాకిరికి విముక్తి లభించిందని సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తోడేటి కొమరయ్యను మండల ప్రముఖులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ, దాష్టీకానికి, వెట్టి చాకిరి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అనేక మంది కార్యకర్తలు చనిపోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, పోతుల నర్సింహారావు, కత్తి సత్యం, ఈశ్వరలింగం, గంగావత్ లక్ష్మణ్ నాయక్, కందునూరి మహేశ్వరరావు, అన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.



తోడేటి కొమురయ్యను సన్మానిస్తున్న మండల ప్రముఖులు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- తొర్రూరు డిపో బీసీ సంఘ కమిటీ ఎన్నిక



శ్రీలత



వెంకన్న

తొర్రూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం వరంగల్ రీజనల్ అధ్యక్షుడు జి. రమేష్, కార్యదర్శి ఎం. సాంబయ్య అన్నారు. మంగళవారం తొర్రూరు ఆర్టీసీ డిపోలో బీసీ ఉద్యోగుల సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు. అనంతరం తొర్రూరు డిపో బీసీ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గన్నోజు శ్రీలత, సెక్రటరీగా శనిగరం వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిట్యాల వనజ, యాకయ్య, ఉపాధ్యక్షుడిగా సింగారపు యాకయ్య, చింతం రమేష్, ప్రచార కార్యదర్శిగా ఆర్. కవిత, మీడియా కార్యదర్శిగా గోపి, కోశాధికారిగా సంపత్‌తో పాటు మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన బీసీ సంఘం సభ్యులు డీఎం పద్మావతి, ఎస్టీఐ రజితలను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజు, రాజేశ్వరి, అరవింద్, మాధవి, సతీష్, స్వప్న, ఎం. రాజు, రావుల సత్తయ్య, నిర్మల పాల్గొన్నారు.

హెచ్‌ఎం వెంకన్నకు అవార్డు



హెచ్‌ఎం వెంకన్నను సన్మానిస్తున్న లయన్స్ బాధ్యులు

మరిపెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపురం పీఎస్ స్కూల్ హెచ్‌ఎం గుర్రం వెంకన్నకు ఉమ్మడి వరంగల్ జిల్లా లయన్స్ క్లబ్ అవార్డు దక్కింది. వెంకన్న పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య పెంచడం, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి విశిష్ట సేవలకు 320ఎఫ్ లయన్స్ క్లబ్ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాకు వెంకన్న ఎంపికయ్యారు. ఈ అవార్డును సోమవారం రాత్రి భీమారంలోని కేఎల్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ క్లబ్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, ఏపీడీ సుధాకర్‌రెడ్డి నుంచి అందుకున్నారు.

ఎస్సై ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతల పూడ్చివేత




గుంతలు పూడుస్తున్న గండ్రాతి సతీష్

కురవి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రహదారులపై ప్రవమాదకరంగా ఉన్న గుంతలను కురవి ఎస్సై గండ్రాతి సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం పూడ్చివేశారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు మొగిలిచర్ల గ్రామంలో ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా ఉండడంతో మట్టితో పూడ్చివేయించారు. అదే విధంగా బయ్యారం రహదారి, పెద్దతండ రహదారులపై గుంతలను పూడ్చివేశారు. పలు చోట్ల రహదారులకు అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించారు. రహదారులపై గుంతలను పూడ్చడంతో పోలీసులను ప్రజలు అభినందించారు.

సమగ్ర విద్యను అందించడమే లక్ష్యం

- ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కమలాదేవి

తొర్రూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి చిన్నారికి సమగ్ర విద్యను అందించడమే లక్ష్యమని తొర్రూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కమలాదేవి అన్నారు. మంగళవారం తొర్రూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్‌బీ- పడాయి బీ అనే అంశంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధనలో వినూత్న పద్ధతులు, న్యూట్రిషన్‌పై అవగాహన, చిన్నారుల ప్రాథమిక విద్యా విధానాలు, పోషణ్ ట్రాకర్ యాప్ వినియోగం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సంకీర్తన, సూపర్‌వైజర్లు శ్రీదేవి, మల్లీశ్వరి, సునీత, గౌస్య, శోభ, నాగమణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు



స్వేచ్ఛ కోసం
రక్తతర్పణం

నిజాం పాలన నుంచి విముక్తి కోసం వీరోచిత పోరాటం

రజాకార్ల దాష్టీకానికి ఎందరో బలి
విమోచన ఉద్యమంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా
నేడు హైదరాబాద్ సంస్థాన విమోచన దినం

హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అలనాటి పాలనలో భూస్వామ్య, జమీందారుల పెత్తనం, అడుగడుగునా నిర్బంధాలు, బలవంతపు వసూళ్లు నిత్యకృత్యంగా సాగేవి. వీటికితోడు రజాకార్ల అకృత్యాలు ప్రజలకు శాపాలుగా మారాయి. వీటిని ఎదురించే దిశగా ప్రజలు చైతన్యవంతులై తమ హక్కులను కాపాడుకునేందుకు పెద్దఎత్తున ఉద్యమించారు. అలా విమోచన ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పోరాటాల గడ్డగా నిలిచింది. విమోచన ఉద్యమ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్నది. కాకతీయులు ఏలిన గడ్డపై రజాకార్లను ఎదురించిన వ్యక్తిగా బత్తిని మొగిలయ్య గౌడ్ చరిత్రలో నిలిచిపోయారు. బైరాన్‌పల్లి గ్రామం పైపడి ఊరును వల్లకాడు చేశారు. వందమందికి పైగా పొట్టన పెట్టుకున్నారు. రజాకార్లు కూటిగల్ మీద కూడా అదే ప్రతాపాన్ని చూపారు. 18 మందిని నిలబెట్టి రాక్షసంగా కాల్చి చంపారు. పరకాలలో ప్రజాసమూహంపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి అనేక మంది ప్రాణాలు బలిగొన్నారు. రజాకార్ల అండతో చెలరేగిన దొరల దౌర్జన్యాన్ని ఎదురించిన చాకలి ఐలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకం చేసింది. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడిచేసి దాన్ని లేవనెత్తించారు. కడవెండి, అమ్మాపూర్, నాంచారి మడూరు తదితర ప్రాంతాల్లో సాగిన తెలంగాణ విమోచన ఉద్యమాలు ప్రజల స్వేచ్ఛా పిపాసకు నిలువెత్తు పతాకలు.

బైరాన్‌పల్లి నెత్తుటికథ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బైరాన్‌పల్లి ఉదంతం మరువరానిది. బైరాన్‌పల్లి గ్రామస్తులందరూ సమైక్యంగా నిలిచి ధైర్యసాహసాలు ప్రదర్శించి నిజాం సైన్యం బలగాలను, రజాకార్ల రాక్షసకృత్యాలను ఎదురించి పోరాడారు. బైరాన్‌పల్లి పోరాటానికి ఇమ్మడి రాజిరెడ్డి, జగ్గం హనుమంతు, చల్ల నర్సిరెడ్డి, మోటాపోశాలు, తోటరాములు ఇమ్మడి రాంరెడ్డి తదితర పోరాటయోధులు నాయత్వం వహించారు. వీరు గ్రామ ప్రజల సహకారంతో దొరల అకృత్యాలను ఎదురించడమే కాకుండా నిజాం సైన్య బలగాలను,రజాకార్ల దోపిడీలను తిప్పికొట్టారు. ఒక రోజు రజాకార్లు దూలిమిట్ట, లింగాపురం గ్రామాలను దోచుకొని సొమ్మునంతా బండ్లకెత్తుకొని తరలిస్తుండగా బైరాన్‌పల్లి రక్షక దళం రజాకార్లను ఎదిరించి తరిమికొట్టింది. దీంతో బిత్తరపోయిన రజాకార్లు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. బైరాన్‌పల్లిపై కక్షతో రజాకార్లు కూటిగల్ గ్రామంలో 20 మందిని కాల్చి చంపారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 12 రోజులకే 1947 ఆగస్టు 27న అర్ధరాత్రి రజాకార్ల మూకలు బైరాన్‌పల్లిని చుట్టుముట్టాయి. బైరాన్‌పల్లి బురుజుపై ఉన్న గస్తీదళ సభ్యులు సైన్యాలను ఎదురించి కాల్పులు జరిపారు. ట్యాంకులు మోగుతున్నాయి. స్టెన్‌గన్‌లు పేలుతున్నాయి. తుపాకీ గుండ్లు దూసుకుపోతున్నాయి. బిత్తరపోయి మేల్కొన్న జనం కకావికలమయ్యారు. బురుజుపై ఉన్న పోరాటవీరులు తమ వద్ద ఉన్న మందుగుండు అయిపోయేంత వరకు సైన్యాన్ని నిలువరించగలిగారు. బురుజు నుంచి కాల్పులు ఆగిపోగానే సైన్యం బలగాలు గ్రామంలోకి ప్రవేశించి మారణహోమాన్ని సృష్టించారు. పారిపోగా మిగిలిన 84 మందిని వరుసగా నిలబెట్టి నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపారు. ఆ తర్వాత విమోచనకారులు నిజాంపై, రజాకార్యలపై ఎదురుదాడులకు దిగారు. చాకలి ఐలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకంగా నిలిచింది. రజాకార్ల అండతో దొర సాగిస్తున్న దాష్టీకాలను ఐలమ్మ ఎంతో ధైర్యంతో ఎదురించింది. దాడులను లెక్క చేయక మొక్కవోని ధీరత్వంతో పోరాటం సాగించి తన భూమిని కాపాడుకున్నది. దీనిని స్ఫూర్తిగా తీసుకొని ఆనేక చోట్ల పోరాట యోధులు రజాకార్లకు వ్యతిరేకంగా దాడులు సాగించారు. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడి చేసి దానిని లేవనెత్తించారు. కడవెండి అమ్మాపూర్, నాంచారి మడూర్‌కు చెందిన అనేకమంది పోరులో పాల్గొన్నారు. జఫర్‌గడ్‌లో, మధిర తాలూకా సిరిపురం గ్రామంలో రజాకార్లు సమరశీలురైన రైతులను కాల్చి చంపారు. 200 మంది రజాకార్లు వచ్చి అల్లిపురం గ్రామాన్ని తగులబెట్టారు. దీనికి ప్రతిగా పోరాటయోధులు రజాకార్లపై ప్రతిదాడి జరిపి ప్రతీకారం తీర్చుకున్నారు.

మొగిలయ్య వీరమరణం

రజాకార్ల దాష్టీకానికి పరాకాష్టంగా నిలుస్తోంది బత్తిని మొగిలయ్య హత్యోదంతం. 1946లో తెలంగాణ విమోచనోద్యమం ఒక పక్క, భారత స్వాతంత్రోద్యమం మరో పక్క ముమ్మరంగా సాగుతున్న రోజులవి. వరంగల్ కోట నివాసి అయిన మొగిలయ్య మొదటి నుంచి విమోచనోద్యమంలో చురుకుగా పాల్గొంటుండేవాడు. ఉద్యమంలో భాగంగా సర్వోదయ సంఘం పక్షాన ప్రతీవారం వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. 1946 ఆగస్టు 11న కోటలో జెండా ఎగరువేసిన తర్వాత కాశీంషరీఫ్ నాయత్వంలో రజాకార్లు హఠాత్తుగా దాడి చేశారు. రజాకార్లను ఎదురించే క్రమంలో మొగిలయ్య రజాకార్ల కత్తి పోట్లకు గురై నేలకొరిగాడు.

విముక్తి

క్రమేణా పెరిగిన రజాకార్ల ఆరాచకత్వం, విశృంఖలత్వం అంతమొందించాల్సిన అవసరం గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 1948 సెప్టెంబరు 13న పోలీసు చర్యకు ఆదేశించింది. దీని పేరు ఆపరేషన్ పోలో. వరంగల్ జిల్లాలో ఆపరేషన్ పోలో విజయవంతం కావడంలో మామునూరు విమానాశ్రయం ఎంతగానో దోహదపడింది. సైన్యం విమానాల ద్వారా ఈ విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి రజాకార్ల ఏరివేతను మొదలుపెట్టారు. సైనికులు జల్లెడలా విస్తరిస్తూ వెళ్లి రజాకార్లను ఎక్కడికక్కడ అణిచివేశారు. ఇక దిక్కులేని స్థితిలో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ ప్రభుత్వాన్ని శరణుజొచ్చాడు. పోలీసు చర్యతో ప్రజలకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించింది. ప్రజలు పూర్తి స్వేచ్ఛా వాయువులను పీల్చుకోగలిగారు. నిజమైన స్వాతంత్ర పోరాట ఫలాలు పొందగలిగారు.

పరకాల మారణ హోమం

తెలంగాణ విమోచనోద్యమంలో పరకాల మారణ హోమం ఒక రక్తసిక్త ఘట్టం. ఇక్కడి ప్రజలు నిజాం వ్యతిరేక ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సంఘటితమై రజాకార్లకు ఎదురొడ్డి నిలిచారు. జన జాగృతిలో భాగంగా 1947 సెప్టెంబరు 2న తాలూకా కేంద్రమైన పరకాలలో సమావేశం నిర్వహించాలని ఉద్యమ నాయకులు నిర్ణయించారు. ఈ సమావేశానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరకాల పక్కన పైడిపెల్లి తాటివనంలో జనమంతా పోగయ్యారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలంటూ చేసిన నినాదాలు ఆ ప్రాంతమంతా మిన్నంటాయి. అప్పటికే ఒక పోలీసులు, మరో పక్క రజాకార్లు మోహరించారు. ఉద్యమాన్ని మానుకోవాలని పోలీసులు కోరినా ప్రజలు ఊరుకోలేదు. తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఫైరింగ్ ఆర్డర్ ఇవ్వడంతో అప్పటికే కాచుకున్న పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. మరో పక్క ఇదే అవకాశంగా రజాకార్లు విరుచుకుపడ్డారు. తల్వార్లు, కత్తులు, బరిసెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో అనేకమంది ప్రాణాలు విడిచారు. అనేక మంది గాయపడ్డారు. రక్తం ఏరులై పారింది. కాళ్లు, చేతులు తెగిపడ్డాయి. మాంసం ముద్దలతో ఆ ప్రదేశమంతా భయంకరంగా మారింది. మరో జలియన్‌వాలా బాగ్ ఉదంతాన్ని తలపింపచేసింది.

సరిహద్దు శిబిరాలు

నిజాం అండచూసుకున్న రజాకార్లు గ్రామాలను దోపిడీ చేయడం, ఎదురు తిరిగినవాళ్లను క్రూరంగా హింసించి చంపడం, స్త్రీలను చెరచడం, గ్రామాలను తగులబెట్టడం సాగించారు. జిల్లాలో ప్రజలకు రక్షణ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు కొందరు పొరుగు రాష్ట్రాలకు పారిపోయారు. మిగిలిన ప్రజల రక్షణ భారాన్ని ఉద్యమకారులు తీసుకున్నారు. అప్పటి పరిస్థితులను బట్టి ఉద్యమాన్ని కొనసాగించే వ్యూహంలో భాగంగా ఉద్యమకారులు సరిహద్దు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇవి మొదట్లో నైజాం స్టేట్‌లో కాక, ఇండియన్ యూనియన్ భూభాగాలైన చందా (మహారాష్ట్ర). గదక్ (కర్నాటక), విజయవాడ (ఆంధ్ర) మొదలైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఒక్కో సరిహద్దు శిబిరానికి ఒక్కో నాయకుడు నాయత్వం వహించారు. విజయవాడలోని సరిహద్దు శిబిరం హయగ్రీవాచారి నాయత్వంలో నడిచింది. ఉద్యమ ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలు రాత్రుళ్లు రహస్యంగా తెచ్చి గ్రామాల్లో పంచేవారు. రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మందుగుండు సామగ్రి వచ్చేది.

వెన్నుచూపని బందగీ



విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి, ఆయన సతీమణి (ఫైల్)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ముందే కామారెడ్డిగూడెం షేక్ బంధగీ విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డిని ఎదిరించి తన ప్రాణాలను బలిదానం చేశాడు. తనకు సోదరుల మధ్య జరిగిన భూమి పంచాయితీ రాంచంద్రారెడ్డి వద్దకు వెళ్తే, బందగీ సోదరులకు అతడు అండగా నిలిచాడు. దీంతో బందగీ కోర్టుకు వెళ్లాడు. ఈ కేసులో బందగీకి అనుకూలంగా తీర్పు వస్తుందని గ్రహించిన దేశ్‌ముఖ్ బందగీ సోదరులతో కుట్ర పన్ని హత్య చేయించాడు. బందగీ మరణించినా కేసు న్యాయ పోరాటంలో గెలిచాడు. ఇలాంటి అకృత్యాలెన్నో దేశముఖ్ పరిపాలనలో జరిగాయి.

వీరనారి ఐలమ్మ



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోయింది.ఈ పోరాటంలో ముందుండి పోరాడింది చాకలి ఐలమ్మ. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడింది. ఆనాడు జరిగిన పోరాటంలో ఆంధ్ర మహాసభ కార్యకర్తలు ఐలమ్మకు అండగా ఉండి ఆ పోరాటానికి ఆజ్యం పోశారు. మల్లంపల్లికి చెందిన మక్తేదార్ కొండల్‌రావు తల్లి జయప్రద దేవి వద్ద ఐలమ్మ కొంత భూమిని కౌలుకు తీసుకుంది. ఆ భూమిని సాగు చేసి పంట పండిస్తుంటే అప్పుడు మొదలైంది. ఐలమ్మకు, విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి మధ్య వైరం ప్రారంభమైంది. దేశముఖ్‌ను ఎదిరించిన ఐలమ్మ భూపోరాటం ప్రపంచ స్థాయిలో గుర్తుండి పోయింది. 1945 ప్రారంభంలో జనగామ తాలూకాలో మొట్టమొదటి సారిగా పాలకుర్తిలో ఆంధ్ర మహాసభ ఏర్పాటైంది. ఆంధ్రమహా సభ నాయకులు, కార్యకర్తలు, ఐలమ్మకు అండగా ఉండి రైతాంగ సాయుధ పోరాటానికి నాంధీ పలికారు.

దొడ్డి కొమురయ్య వీర మరణం



తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి మరణం పొందిన వ్యక్తి కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య. 1946 జూలై 4న దేశ్‌ముఖ్ వ్యతిరేకంగా జరుగుతున్న ప్రదర్శనలో కొంరయ్య ముందు భాగాన నిలిచాడు. గ్రామంలో దేశ్‌ముఖ్ తల్లి జానమ్మ దొరసాని కొడుకు రాంచంద్రారెడ్డి అండతో ప్రజలను అనేక రకాలుగా పీడించింది. దీనికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కార్యకర్తలు ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. దేశముఖ్ గూండాలు ఆంధ్ర మహాసభ కార్యకర్తలపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దొడ్డి కొంరయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరి కొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణ సాయుధ పోరాటానికి నాంధీ పలికింది. అప్పటి వరకు శాంతియుతంగా నిర్వహించిన పోరాటాలు, మాణ, ప్రాణాల కోసం భానిసత్వాన్ని విముక్తి పొందేందుకు రజాకర్లు, పోలీస్ బలగాలను ఎదిరించేందుకు ప్రజలు ప్రతిఘటణ పోరాటాలు చేశారు.

విస్నూరు దొర అకృత్యాలు



విస్నూరు గడి


విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి అరాచకాలకు కేంద్ర బిందువే విస్నూరు గడి. ఈ గడి అకృత్యాలు, అరచకాలకు నిలయంగా నిలిచింది. దేశ్‌ముఖ్‌కు ఎదురు తిరిగితే రజాకార్లను పంపించి గడిలోని చీకటి గుహలో వేసి అకృత్యాలకు పాల్పడే వారు. చాకలి ఐలమ్మ భూమిలో పండిన పంటను తీసుకురమ్మని రజాకార్లను పంపించింది. దేశ్‌ముఖ్ ఇక్కడి నుంచే ఆదేశాలిచ్చారు. మహిళలను నగ్నంగా ఉంచి బతుకమ్మ ఆడించిన ఘటనను ఇక్కడి ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు. కమ్యూనిస్టు అగ్ర నాయకుడు భీంరెడ్డి నర్సింహరెడ్డిని తీసుకువచ్చి చెవిలో సీసం పోసి చిత్ర హింసలకు గురి చేసింది ఈ గడిలోనే. ఇప్పటికీ ఈ గడీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ గడీ నిర్మాణాన్ని 1940లో ప్రారంభించి 1943లో పూర్తి చేశారు. విస్నూరు చుట్టూ ఉన్న 60గ్రామాల ప్రజల నుంచి బలవంతంగా వసూల్ చేసిన రూ. 2 లక్షల రూపాయలను గడి నిర్మాణానికి ఖర్చు చేశారు.

- ఆంధ్రజ్యోతి, పాలకుర్తి

చరిత్ర మరువని రోజు
సెప్టెంబరు 17



తెలంగాణ చరిత్ర మరువని రోజు 1948 సెప్టెంబరు 17. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17 ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగడ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనికకారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదల య్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలి ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు

పోరాట చరిత్రను వక్రీకరించద్దు



నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రతో సంబంధం లేని వాళ్లు విమోచనం అంటూ రాద్ధాంతం చేయడం సరికాదు. ఆ మహత్తర పోరాటంలో ప్రాణాలకు తెగించి మరీ పోరాడిన మేమంతా బతికుండగానే ఈ నేల చరిత్రను వక్రీకరిస్తున్నారు. త్యాగాలను అవమానిస్తున్నారు. కొత్త రాజకీయ ఎత్తుగడలో భాగంగానే వాళ్లు నాలుగేళ్లుగా విమోచనం పాటెత్తుకున్నారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుల సాయుధ పోరాటం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైందనేది వాస్తవం.

- కందిమళ్ల ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్

కమ్యూనిస్టులకు ఆయుధాలు అందించా



నాది భూస్వామ్య కుటుంబమే అయినా, నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నాను. అప్పట్లో హెచ్ఎస్‌సీ ప్రీ ఫైనల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనే వార్షిక పరీక్షలకు పంపేవారు. దీనికి వ్యతిరేకంగా ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ పెద్ద ఉద్యమమే లేవనెత్తింది. అందులో నేనూ పాల్గొన్నాను. అలా మగ్ధూం, జావెద్ రజ్వీ, సీహెచ్ రాజేశ్వరరావు, రాజ్‌బహదూర్ గౌర్ లాంటి కమ్యూనిస్టు నాయకులతో పరిచయం ఏర్పడింది. నిజాం వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఎన్నో సార్లు మందుగుండు సామాగ్రి, తుపాకీలు లాంటి ఆయుధాలు రహస్యంగా అందించాను. కొన్నాళ్ల రహస్య జీవితం గడిపాను. కమ్యూనిస్టు పార్టీ చైతన్యంతో వారసత్వంగా వచ్చిన వందల ఎకరాల భూమిని పంచాను.


- మొహ్మద్ ఖాజా మొయినుద్దీన్, నిజాం వ్యతిరేక పోరాటయోధుడు, 99ఏళ్లు

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మానప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నరసింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు రోజు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మొహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మొహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎం మున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్... భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.





ఆర్టీసీ యాత్ర దానం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

'ఆర్టీసీ యాత్ర దానం' పోస్టర్ల ఆవిష్కరణ

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఎమ్డీ. సజ్జనార్ ఆదేశాలతో శ్రీకారం చుట్టిన యాత్ర దానం కార్యక్రమ పోస్టర్లను మానుకోట జిల్లాకలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడుతూ అనేక దానాల్లో యాత్ర దానం ఒకటని, యాత్రదానంతో దివ్యాంగులు, అనాథ పిల్లలు, స్కూల్ పిల్లలకు మేలు చేసిన వారవుతారని చెప్పారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో నుంచి డీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను మీరు కోరుకున్న ప్రదేశాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో ఎవరైనా దాతలు యాత్ర దానం చేయాలనుకుంటే మానుకోట ఆర్టీసీ డిపో మేనేజర్ సెల్: 9959226054ను సంప్రదించాలని కోరారు. దాతలు ముందుకు వచ్చి యాత్రదానం చేయాలని కోరారు. మానుకోట, తొర్రూరు డిపోల మేనేజర్లు ఎం. శివప్రసాద్, వి.పద్మావతి, ఎస్టీఐ రజిత పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న కేంద్రం

● సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటాన్ని కేంద్రం వక్రీకరిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి ఆరోపించారు. ఈ నెల 11 నుంచి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తొర్రూరు మండలం హరిపిరాల, వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించారు. విజయసారథి హరిపిరాలలో వల్లపు కొమురెల్లి, వెంకటాపురంలో మొగుళ్ల మల్లయ్య స్థూపాల వద్ద నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోరాట యోధుల కుటుంబ సభ్యులను సన్మానించి మాట్లాడారు. నిజాం, దొరలు, భూస్వాముల అరాచకాల నుంచి తెలంగాణను విముక్తి చేసిన రైతుల పోరాటమన్నారు. సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిషన్ మాజీ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ భిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, మాజీ సర్పంచ్ మామిళ్లపల్లి రమేష్, గణపురం లక్ష్మణ్, కిరణ్‌కుమార్, వల్లపు వెంకన్న, యాదగిరి, కోటగిరి యాకాంతం, ఎల్లయ్య పాల్గొన్నారు.



అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న విజయసారథి తదితరులు



కేజీబీవీని తనిఖీ చేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

● మెనూ విస్మరిస్తే కఠిన చర్యలు ● కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మరిపెడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విధులను నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సూచించారు. మెనూ విస్మరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ మరిపెడ కేజీబీవీని తనిఖీ చేశారు. వంటలను పరిశీలించారు. హాస్టల్లోని డైనింగ్ హాల్, స్టోర్, వంట గదులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులకు షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వం సూచించిన విధంగా బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, వైద్య పరీక్షలు, డిజిటల్ తరగతులు, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో శిక్షణ అందించాలని టీచర్లను ఆదేశించారు. అనంతరం మరిపెడ పీఏసీఎస్‌లోని యూరియా పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దన్నారు. యూరియా అవసరమయ్యేంతా సరఫరా చేస్తామన్నారు. కలెక్టర్ వెంట స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఏడీఏ విజయ్‌చందర్, తహసీల్దార్ కృష్ణవేణి, ఏవో వీరాసింగ్, పీఏసీఎస్ సీఈవో నరేశ్ తదితరులు ఉన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో క్లీన్‌అండ్‌గ్రీన్

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగన్నాయకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద గూడూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ సూర్యప్రకాష్ ఆదేశాల మేరకు ఎస్సై గిరిధర్ రెడ్డి సిబ్బంది సాయంతో డోజర్ ఏర్పాటు చేసి రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెత్తచెదారంను తొలగించారు. ఇటీవల కాలంలో ఇదే క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందిన విషయం విదితమే. ప్రమాదాలు చోటు చేసుకోకుండ రోడ్డుకు ఇరువైపుల అడ్డుగా ఉన్న చెట్లను తొలగించినట్లు చెప్పారు. దీంతో ప్రజలు పోలీసుల సేవలను అభినందించారు.

ప్రజాసమస్యలపై పోరాటం : సీపీఎం

కేసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరు స్ఫూర్తితో ప్రజాసమస్యలపై పోరాటం కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు అన్నారు. కేసముద్రంలో మంగళవారం సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రాజు మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటానికి అసలైన వారసులు కమ్యూనిస్టులేనని అన్నారు. ఈ పోరుకు ఎలాంటి సంబంధం లేని బీజేపీ మత పోరుగా చిత్రీకరిస్తోందని ఆరోపించారు. పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, నీరుటి జలేందర్, జల్లె జయరాజు, జాటోత్ వెంకన్న, సోమారపు ఎల్లయ్య, కదిరె రాజు, ముద్రకోల సారయ్య, తులసిమొగ్గ శేఖర్, చిక్కుడు రమేష్ పాల్గొన్నారు.

సబర్మతి ఆశ్రమంలో గాంధీజీ మాసోత్సవాల సదస్సు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ సబర్మతి ఆశ్రమంలో మానుకోటకు చెందిన గాంధీజీ రీసెర్చ్ ఫౌండేషన్ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సును నిర్వహించారు. తొలుత గాంధీజీ మాసోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ గాంధీజీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా సెప్టెంబరు 2 నుంచి అక్టోబరు 2 వరకు నెలరోజుల పాటు గాంధీజీ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని అందులో గాంధీజీ అనుసరించిన అహింసా, సత్యమార్గాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. శాంతి ఉద్యమాలకు మహాత్మాగాంధీ ఆదర్శనీయమని, యువతలో గాంధీతత్వం, అహింసా, సత్యమార్గాల వ్యాప్తికి కృషి చేయడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. గాంధీజీ ఆశయాలను ముందకు తీసుకుపోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గాంధీజీ రిసెర్చ్ ఫౌండేషన్ బాధ్యులు రాచకొండ మహేష్, జానకి రామన్, గోవిందరాజ్, తన్నీరు వాసుదేవ్, సురేష్, సుబ్రతాబెనర్జీ, నర్సింహమూర్తి, బత్తుల ఈశ్వర్ ప్రసాద్, శ్రీనివాసన్ అండాల్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల విద్యపై దృష్టి సారించాలి : సీడీపీవో



సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో నిలోఫర్ అజ్మి

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాల్య సంరక్షణ, పిల్లల విద్యపై అంగన్‌వాడీ టీచర్లు దృష్టి సారించాలని గూడూరు ఐసీడీఎస్ సీడీపీవో నిలోఫర్ అజ్మి అన్నారు. భూపతిపేట రైతువేదికలో మంగళవారం పోషణ్‌-బీ.. పఢాయి-బీలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఎర్లిచైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ద్వారా కార్యక్రమాల పట్ల ఆలసత్వం ప్రదర్శించవద్దన్నారు. నూతన విద్యావిధానం ఈ సూత్రాలకు అనుగుణంగా మాతృభాషలో విద్యనందించాలని, ప్రతిరోజు కనీసం రెండు గంటలపాటు నాణ్యమైన ప్రీ స్కూల్ బోధన చేయాలన్నారు. ఏసీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జేఎన్‌టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ బలరాంనాయక్, ఎస్సై అశోక్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో నమూనా ఎన్నికలు

కేసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల మోడల్ స్కూల్లో మంగళవారం ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. నామినేషన్లు దాఖలు, ఓటరుజాబితా, బ్యాలెట్ పేపర్, ఎన్నికల అధికారులు, భద్రత పర్యవేక్షించే పోలీసులను విద్యార్థులే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరిమి నవీన్, ఉపాధ్యాయులు యాకయ్య, శ్వేత, విజయకుమారి, పూర్ణచంద్ర, సోమయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

మలుపుల్లో పొదల తొలగింపు



కేసముద్రం-మానుకోట రహదారిలో పొదలను తొలగిస్తున్న పోలీసులు

కేసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం నుంచి కల్వల మీదుయయ గా మహబూబాబాద్‌కు వెళ్లే దారిలో మూలమలుపుల వద్ద పొదలను రూరల్ సీఐ పి.సర్వయ్య ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. మూలమలుపుల వద్ద పొదలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించడంలేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలుండడంతో ముందుజాగ్రత్తగా వీటిని ఎక్స్‌కవేటర్ యంత్రంతో తొలగించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ట్రైనీ ఎస్ఐ నరేష్, పీసీలు పాల్గొన్నారు.



ఢిల్లీలో కేంద్ర ఉక్కు, గనుల శాఖమంత్రి కుమారస్వామితో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

'ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి'

బయ్యారం(డోర్నకల్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన హామీ చట్టంలో పేర్కొన్న విధంగా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఉక్కు గనుల శాఖమంత్రి హెచ్‌డి.కుమారస్వామిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ విభజనచట్టంలో బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని చెప్పి పదేళ్లయిన ఇంత వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. తెలంగాణలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన బయ్యారంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే అక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు.

నేడు చాంప్లాతండాలో వైద్య శిబిరం

డోర్నకల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా డోర్నకల్ చాంప్లాతండా, ముల్కలపల్లిలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ జిల్లా నాయకురాలు గుగులోతు దేవిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాంప్లాతండాలో ఉచిత కంటి వైద్య శిబిరంతోపాటు సాధారణ వైద్య శిబిరం, ముల్కలపల్లిలో సాధారణ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.

డోర్నకల్‌లో ఉచిత రక్తదాన శిబిరం

డోర్నకల్‌లోని జైన్‌భవన్‌లో బుధవారం అఖిలభారతీయ జైన మహిళ పరిషత్ డోర్నకల్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రాస్తులకు అందించేందుకు దాతల నుంచి రక్తాన్ని సేకరించనున్నట్లు చెప్పారు. రక్తదానం చేసే వారు డోర్నకల్ జైన్‌భవన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంప్రదించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కురవి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని హెచ్‌ఎం సత్యనారాయణచారి అన్నారు. కురవి మండలం మోదుగులగూడెంజడ్పీఎస్ఎస్‌లో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. శ్రీరాములు, లత, సలీం, ఇందిర, దీపిక, వీరన్న, రజిత, భాగ్యలక్ష్మి, విష్ణు, రమేష్, వెంకన్న, సునీల్, అనిత పాల్గొన్నారు.

ఓజోన్‌పొర సంరక్షణ దినోత్సవం

కేసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర సంరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులు ఆ పొరను సూచించే 'ఓ3' అక్షరాల ఆకారంలో కూర్చున్నారు. గొడుగులతో విద్యార్థులకు ఓజోన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం బండారు నరేందర్, రాచకొండ ఏకాంబ్రం, బి.సత్యనారాయణ, తండ సదానందం, వి.నాగేందర్, పీడీ కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లకు చేయూతనందించాలి

● మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి

కురవి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్థికంగా స్థిరపడిన వారు చేయూనందించాలని మాజీ జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి అన్నారు. కురవి మండలం గుండ్రాతిమడుగు జడ్పీఎస్ఎస్ పాఠశాలకు ఇటీవల మృతి చెందిన బండి రోహిత్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన తండ్రి అనిల్‌రెడ్డి మార్చ్‌పాస్ట్ డ్రమ్స్‌సెట్‌ను అందించారు. ఈ సందర్భంగా బండి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేదలు చదివే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనందించిన అనిల్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం భద్రు, ప్రైమరీ హెచ్‌ఎం. ఎస్.రాఘువేందర్, బండి అనిల్ రెడ్డి, జంగిలి హరిప్రసాద్, ఉపాధ్యాయులు యాదగిరి, సురేష్, మహేష్, రమ, శ్రీధర్, కమల్‌కిశోర్, రాంసింగ్ పాల్గొన్నారు.

ఐదు రోజుల్లో యజమానులు తమ పశువులను తీసుకెళ్లాలి

● లేకుంటే మునిసిపల్ ఆధ్వర్యంలో స్వాధీన పర్చుకుంటాం

● మునిసిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలోని రోడ్లపై పశువులు, ఆవులుండండంతో వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నారని ఐదు రోజుల్లో యజమానులు వారి పశువులను ఇంటికి తీసుకువెళ్లాలని మునిసిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్ మంగళవారం తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక జిల్లా పేజీలో ఈనెల 8న మానుకోట ప్రధాన రహదారుల్లో గోవులు.. ఇబ్బందులు పడుతున్న పాదాచారులు, వాహనదారులు అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన కమిషనర్ మంగళవారం పట్టణంలో పరిస్థితిని గమనించి ప్రకటన విడుదల చేశారు. పశువుల యాజమానులు ఐదు రోజుల్లోగా తమ పశువులు, ఆవులను ఇంటికి తీసుకువెళ్లాలని సూచించారు. లేని పక్షంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో గోవులను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పశువుల యాజమానులు గమనించి వెంటనే తమ గోవులను తీసుకువెళ్లాలని చెప్పారు.

'ఆమె'కు ఆరోగ్యం

(5వ పేజీ తరువాయి)

శిశువులు, చిన్నారుల పోషణపై సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. పౌష్టికాహార అనుబంధ వంటకాల తయారీపై పోటీలు ఏర్పాటు చేయనున్నారు. 18న కిషోర బాలికలకు పరీక్షలు, పిల్లల కోసం బరువు, ఎత్తు కొలతలు తీయడం అదే విధంగా ఆహారంలో చక్కెర, నూనె వినియోగాన్ని తగ్గించే విషయంపై అవగాహన, 19న తల్లిదండ్రులతో పోషకాహారం ప్రతిజ్ఞలు, 22న అంగన్‌వాడీ కేంద్రాల్లో బొమ్మల ప్రదర్శనలు, 23న పౌష్టికాహార పదార్థాలపై వినియోగంపై అవగాహన, 24న బిడ్డపుట్టిన గంటలోపు శిశువుకు ముర్రుపాలు పట్టించడంపై అవగాహన సమావేశాలు, 26న పిల్లల సంరక్షణలో తల్లిదండ్రుల భాగస్వామ్యంపై పోషణ సమావేశాలు, 29న తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశం, 30న స్థానిక వంటలు, చిరు ధాన్యాలు, ఫలాలు, కూరగాయలపై అవగాహన కల్పిస్తారు.

అక్టోబరు 2న పోషణ లోపం ఉన్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహించడం, 3న గ్రామ, వార్డు సభలు, 4న పర్యావరణ రక్షణపై ప్రతిజ్ఞలు, 6న పోషణ లోపం ఉన్న పిల్లల జాబితా తయారు చేయడం, 8న పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన, 9న తక్కువ నూనె, చక్కెర వినియోగంతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన , 11న అంగన్‌వాడీ కేంద్రాల శుభ్రత, 13న పాఠశాలల్లో మీరు తినేఆహారం మీ పెరుగుదల అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు 14న పాఠశాలల్లో మొక్కలు నాటడం, 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో సలహా సమావేశాలు, 16న జింక్ ఫుడ్, అధికబరువు తదితర అంశాలపై అవగాహన సమావేశాల ఏర్పాటుతో పోషణ మాసం ముగియనుంది.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అప్పరాజుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇరువురు రైతు కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. దుబ్బగూడెం, జోషితండాకు చేరుకుని బానోత్ లాల్య, దరావత్ వీరన్న కుటుంబసభ్యులను కాంగ్రెస్ నాయకులు కలిసి ఓదార్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తిస్వామి, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్‌నాయక్, జిల్లానాయకులు మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి ఓదార్చారు.

సాయుధ పోరాట చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలి

కురవి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కురవిలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద పార్టీ పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంతో ఎటువంటి సంబంధం లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. సాయుధ పోరాటానికి మతం, రంగు పులిమేందుకు చేస్తున్న కుట్రలను ప్రగతిశీల శక్తులు ప్రతిఘటించాలన్నారు. భూమికోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న, దొంతు రామ్మూర్తి, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, బస్వ కొమురయ్య, గజ్జి చంద్రయ్య, నాగేశ్వర్‌రావు, అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి

రాకపోకలు పునరుద్ధరిస్తాం : ఈఈ

బయ్యారం (డోర్నకల్), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బయ్యారం మండలంలోని బీమ్లాతండా-కంబాలపల్లి మధ్య కొత్తూరు సమీపంలోని కల్వర్టు వరదలకు ధ్వంసమైంది. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు నిలిచిపోయాయి. విషయాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం పంచాయతీరాజ్ ఈఈ విద్యాసాగర్ కొట్టుకుపోయిన కల్వర్టు ప్రదేశాన్ని పరిశీలించారు. కల్వర్టు కొట్టుకుపోయిన చోట తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలకు పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. డీఈ వాసు, పీఏసీఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఏఈ అనిల్, సింగిల్ విండో డైరెక్టర్ తెల్లం భిక్షం, మాడె భద్రయ్య, కాంట్రాక్టర్ కత్తి రమేష్ ఉన్నారు.



కల్వర్టును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఈఈ విద్యాసాగర్

త్వరలో 3వ నెంబరు రైల్వేలైన్ ట్రాక్‌ను అందుబాటులోకి తెస్తాం

(5వ పేజీ తరువాయి)

వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు.

సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో..

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో నాలుగో నెంబరు ప్లాట్‌ఫారం నిర్మించాలని కోరుతూ రైల్వే డీఆర్ఎం గోపాలక్రిష్ణన్‌కు సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. 2014లో మంజూరైన ఆర్వోబీని నిర్మించాలని, కొత్త రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని, రైల్వే అండర్ పాస్‌లను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

● మానుకోట రైల్వేస్టేషన్ నాలుగవ నెంబర్ ప్లాట్ ఫారాన్ని నిర్మించాలని వినియోగదారుల సంక్షేమ మండలి జిల్లా కార్యదర్శి మైన శ్రీనివాస్ రైల్వే అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. కొత్త బజారు వైపు ప్లాట్ ఫారం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ప్లాట్ ఫారం నిర్మించిన సమస్యను పరిష్కరించాలని కోరారు.